
క్లుప్తంగా

పారిశుధ్య సమస్యల్లేకుండా చూడండి

నింద్ర: గ్రామాల్లో పారిశుధ్యం సమస్యలపై దృష్టి సారించి మెరుగు పరచడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేసి ఎంపీడీఓ మాట్లాడారు. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా చూడాలని, గ్రామాల్లో వీధిలైట్లకు మరమ్మతులు చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంకుల్లో నీటిని నిలిపిన ప్రతిసారీ క్లోరినేషన్ చేసి నీరు సరఫరా చేయాలన్నారు.

సర్పాల సయ్యాట


పెనవేసుకున్న సర్పాలు

శ్రీరంగరాజపురం: సర్పాలు సయ్యాట ఆడాయి. మండలంలోని పెద్దతయ్యూరు గ్రామం మినరల్ వాటర్‌ప్లాంట్ మంచినీళ్ల గుంట వద్ద శుక్రవారం రెండు పాములు పెనవేసుకున్నాయి. సయ్యాట ఆడుతుండడాన్ని చూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

విద్యుత్ అంతరాయం

పుత్తూరు: మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశ్వరాపురం, లక్ష్మీనగర్, కళ్యాణపురం వద్ద ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేశారు.

పాలసముద్రం: మండలంలో వెంగళరాజుకుప్పం, బలిజకండ్రిగ, రాచపాళెం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ లోకేష్ తెలిపారు.

అన్నదానానికి విరాళం


విరాళం అందజేస్తున్న వైఎస్సార్ జిల్లా వాసులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు శుక్రవారం వైఎస్సార్ జిల్లాకు చెందిన హిమబిందు, రామకృష్ణ లక్ష రూపాయల విరాళమిచ్చారు. ఆలయ సిబ్బంది దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

యోగాతో ఆరోగ్య సిద్ధి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): యోగాతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఎంహెచ్ఓ సుధా రాణి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగాచార్యులు ఉద్యోగులకు ఆసనాలు వేసి చూపించారు. ఆసనాలపై పట్టు పెంచుకోవాలని ఉద్యోగులకు తెలియజేశారు. తద్వారా జరిగే మానసిక, శారీరక, ఆరోగ్య లాభాలను వివరించారు. కార్యక్రమంలో శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా ముత్యాలమ్మ జాతర



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం తేనబండలోని శ్రీ ముత్యాలమ్మ జాతర శుక్రవారం వేడుకగా నిర్వహించారు. తొలుత మూలవిరాట్‌ను అలంకరించి పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి పుష్పపల్లకిలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి పసుపు పళ్లెం, కర్పూర హారతులు పట్టి వేడుకున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బాబు వచ్చె... కడుపు కొట్టె..!

- వలంటీర్ల వ్యవస్థకు మంగళం
- ప్రభుత్వ మద్యం దుకాణాల ఉద్యోగుల తొలగింపు
- ఎండీయూ ఆపరేటర్లు, ఉపాధి మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు
- కూటమి తొలి ఏడాది పాలనంతా తొలగింపులకే ప్రాధాన్యత
- శాపనార్థాలు పెడుతున్న ప్రజానీకం, బాధితులు


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు (ఫైల్)

నగరి: నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెట్టింది. కొత్త ఉద్యోగాల ఊసెత్తక పోగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నియమించిన చిరుద్యోగుల కడుపు కొట్టింది. 50 ఇళ్లకు ప్రభుత్వ పథకాలను చేరవేయడం, అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేయించడం, విద్యుత్ బిల్లుల చెల్లింపులు తదితర సేవలందిస్తూ ప్రభుత్వం–ప్రజలకు నడుమ వారధిలా పని చేస్తూ, కోవిడ్ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు బాసటగా నిలిచిన వలంటీర్ల కడుపు కొట్టింది కూటమి ప్రభుత్వం. నెలకు రూ.10 వేలు జీతం ఇస్తామని నమ్మబలికి చివరకు వలంటీర్ల వ్యవస్థకే మంగళం పాడింది. దీంతో వారు ఉపాధి కోసం ప్రత్యామ్నాయాలు చూసుకోవాల్సి వచ్చింది. నగరి, గంగాధర నెల్లూరు నియోజకవర్గాల్లోనే 2634 మంది వలంటీర్లు ఉద్యోగాలు కోల్పోయారు. మద్యం అమ్మకాలు పెంచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మద్యం షాపులను ప్రైవేటుకు అప్పగిస్తూ తెచ్చిన మద్యం పాలసీతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన ఉద్యోగులు రోడ్డున పడ్డారు. రెండు నియోజకవర్గాల్లో 48 మద్యం దుకాణాల్లో పనిచేసిన 135 మంది ఉద్యోగాలు పోయాయి. స్థిరమైన ఉద్యోగంలో ఉన్నామంటూ గర్వంగా చెప్పుకున్న వీరు ప్రస్తుతం కూలి పనులకు వెళుతున్నారు. ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే వాహనాలను నిలుపుదల చేయడంతో రెండు నియోజకవర్గాల్లో వాటిపై ఆధారపడిన ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) ఆపరేటర్లు 92 మంది వీధిన పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే ఉపాధి కూలీలపై తన ప్రతాపం చూపింది. ఫీల్డ్ అసిస్టెంట్లకు, మేట్లకు రాజకీయ రంగులు పులిమి రకరకాల కారణాలతో వారిని తొలగించింది దీంతో ఏళ్లతరబడి పని చేస్తున్న పలువురు ఉపాధి కోల్పోయారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలుమార్లు శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేసినా వారి ఆశలపై నీళ్లు చల్లింది. వారికి గాలికొదిలేయడంతో ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అరాచకం, దోపిడీ, బలవంతంగా తొలగింపుల పర్వం తప్పితే చేసిందేమీ లేదని బాధితులు, ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు.

ఇది నమ్మక ద్రోహమే



అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని, నెలకు రూ.10 వేలు జీతం ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే చిరుద్యోగులైన వలంటీర్లపై తన ప్రతాపాన్ని చూపిన ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగించింది. ఇది పూర్తిగా నమ్మక ద్రోహమే. –చార్లి, నింద్ర దళితవాడ

ఉద్యోగ భద్రత ఏదీ?



అకస్మాత్తుగా ఎండీయూ ఆపేశారు. అప్పటి వరకు ఆధారంగా ఉన్న ఉద్యోగం ఊడిపోతే ఎలా బతకాలి? కుటుంబాలను ఎలా పోషించాలో అర్థం కావడం లేదు. వాహనాలకు బ్యాంకుల రుణం తాలూకు ఈఎంఐ ఒడంబడిక కూడా 2027 ఆఖరు వరకు ఉండడం వల్ల మేము ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితి ఉంది. –ఎ.రాజేంద్రుడు, కాకవేడు, నగరి మున్సిపాలిటీ

ప్రత్యామ్నాయం చూపకనే తొలగింపు



తమిళనాడు తరహాలో గత ప్రభుత్వం ఇక్కడి మద్యం షాపులను కూడా ప్రభుత్వమే నిర్వహించేలా మార్చి మాలాంటి వారికి ఉద్యోగాలిచ్చి ఆదుకుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మమ్మల్ని తొలగించి వీధిన పడేసింది. తమిళనాడులో ప్రభుత్వాలు మారినా ఉద్యోగాలు కొనసాగించారు. ఇక్కడ ఆ పరిస్థితి లేదు. – పరశురాం, కేవీ పురం, విజయపురం మండలం

అధికారంలోకి రాగానే తొలగించారు



ఉపాధి హామీ పథకం ఐదేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశా. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిలిచిపోవాలని ఆదేశించింది. ఏవేవో కారణాలు చూపుతూ రిజైన్ చేయాలని ఎంపీడీఓతో నోటీసు ఇచ్చారు. అభాండాలు మోపారు. జిల్లా అధికారులకు సరెండర్ చేసి నన్ను తొలగించారు. –రమేష్‌బాబు, కార్వేటినగరం

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి రూ.60 వేలు జరిమానా

నగరి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి సేవించినా మద్యం తాగి వాహనాలు నడుపుతూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ విక్రమ్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో శుక్రవారం ఆరుగురిని నగరి కోర్టులో హాజరు పరచగా జడ్జి సి. జానకి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారన్నారు. మూడు నెలల కాలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 17 గురిని అరెస్టు చేశామని, వారికి రూ. 1.70 లక్షలు జరిమానా విధించారని చెప్పారు. అలాగే బహిరంగంగా మద్యం సేవించిన కేసుల్లో 55 మందిని అరెస్టు చేసి వారికి రూ.55 వేలు జరిమానా విధించినట్లు తెలియజేశారు.

బార్లుగా బస్ షెల్టర్లు..!


ఖాళీ మద్యం బాటిళ్లు, డిస్పోజబుల్ గ్లాసులు, ఇతర వ్యర్థాలతో ఉన్న బస్ షెల్టర్

నగరి: ప్రయాణికులకు ఎండావానల నుంచి తలదాచుకోవడానికి నిర్మించిన బస్ షెల్టర్లు రాత్రిపూట బార్లుగా మారుతున్నాయి. ఉదయాన అక్కడికి వెళ్లిన వారికి బస్ షెల్టర్లలో పడేసిన మద్యం బాటిళ్లు, గ్లాసులు, తినిపడేసిన ఆహార పదార్థాలతో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించి మందుబాబుల భరతం పట్టాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా గంగ జాతర


అమ్మవారికి పొంగళ్లు తెస్తున్న భక్తులు

శ్రీరంగరాజపురం: మండలానికే తలమానికమైన పెద్దతయ్యూరు శ్రీపాపరమ్మతల్లీ గంగమ్మ జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి కర్పూర హారతులు పట్టి నైవేద్యాలు సమర్పించారు. మరికొందరు అమ్మవారికి అంబళ్లు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు వినూత్న వేషధారణతో మొక్కలు తీర్చుకున్నారు. నడివీధిలో కొలువుదీరిన గంగమ్మకు తొలుత వంశ పారంపర్య ధర్మకర్తలు విశేష పూజలు చేసి జాతర ప్రారంభించారు. అనంతరం తోటి వారు ఇంటింటికి వెళ్లి దండోర వేసి అంబలిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంరం భక్తులకు దర్శనం కల్పించారు. బలి చాటింపు తట్టాతో గ్రామం మొత్తం తిరిగి సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు పండాలని అమ్మవారికి వేడుకున్నారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో యువకులు ఉత్సాహంగా డ్యాన్సులు వేశారు.


యోగాపై శిక్షణ ఇస్తున్న వెంకటరమణ


మాట్లాడుతున్న ఎంపీడీఓ పురుషోత్తం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పాలసముద్రం: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సచివాలయ, ఆరోగ్య సిబ్బందికి యోగాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు జూన్ 21 వరకు యోగాపై గ్రామాల్లో ప్రజలు, యువకులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాలన్నారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్, వైద్యాధికారి మోహన్ క్రిష్ణ, ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ, ఏఓ మధువాణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో యోగాపై సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ మోహన్‌మురళి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘ సభ్యులు, గ్రామస్తులకు యోగాపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రబాబు, ఏపీఎం రోజా, ఏపీఓ లలిత, విస్తరణ అధికారి కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలో శనివారం జరిగే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పురుషోత్తం కోరారు. శుక్రవారం వెదురుకుప్పంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసనాలపై ఆసక్తి పెంచుకుని జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలన్నారు.

సూర్యచంద్రులపై అనంత తేజోమూర్తి

- అప్పలాయగుంటలో నేడు రథోత్సవం


సూర్యప్రభ వాహనంపై గోవిందుడు


చంద్రప్రభపై ఊరేగుతున్న శ్రీవారు

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఏడవ రోజు శుక్రవారం వైకుంఠనాథుడు సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై అనంత తేజోమూర్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టుపీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో ముగ్ధమనోహర రూపంలో గోవిందుడు సూర్య చంద్రులపై ఆశీనులై భక్తులను కటాక్షించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశ్వరూప దర్శనం, తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 7.30 గంటలకు శ్రీవారిని వాహన మండపంలోకి వేంచేపు చేశారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్రసన్న వేంకటేశ్వరుడు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతుండగా భక్తుల గోవింద నామస్మరణతో మాడవీధులు మార్మోగాయి. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. తదుపరి శుద్ధి, రెండవ గంట కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం భక్తి కీర్తనల ఆలాపనల మధ్య ఉయ్యాలసేవ అనంతరం శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు.

చంద్రప్రభపై చిద్విలాసంగా..

రాత్రి 7 గంటలకు శ్రీవారు చంద్రప్రభ వాహనంపై విహరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, యువతుల ఆనంద డోలికల కోలాటాల నడుమ స్వామివారు భక్తజనానికి అభయమిచ్చారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. వాహన సేవ అనంతరం అర్చకులు స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

శనివారం ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు రథోత్సవం, సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు అశ్వ వాహనంపై స్వామి వారు విహరిస్తారు.

గిట్టుబాటు లేక గగ్గోలు!

- మామిడి కిలో రూ.8 కాదు.. రూ.6లకే కొనుగోలు
- ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని ఫ్యాక్టరీ యాజమాన్యాలు
- టోకెన్ల కోసం రైతులకు తప్పని పడిగాపులు
- కనీస మాత్రం స్పందించని అధికారులు


అప్లికేషన్ చెత్తలో చింపి పడవేసిన దృశ్యం

గంగాధర నెల్లూరు: మామిడి రైతులు పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. కిలో రూ.8 లెక్కన కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా.. గుజ్జు ఫ్యాక్టరీలు మాత్రం బేఖాతర్ చేస్తున్నాయి. కేవలం రూ.6లకే కిలో మామిడిని కొనుగోలు చేస్తున్నాయి. ఎంతో కొంత వస్తే చాలని రైతులు రాజీ పడినా.. పంట అమ్ముకునేందుక గంటల తరబడని బారులు తీరాల్సివస్తోంది. అయినప్పటికీ కొందరు రైతుల నుంచి మాత్రమే పంటను కొనుగోల చేస్తుండడంతో మిగిలిన వారికి నిరాశే ఎదురవుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుటెండలో జీడీనెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీ ఎదుట టోకెన్ల కోసం రైతులు క్యూలో నిలడాల్సి వస్తోంది. ఈ క్రమంలో రైతులకు కనీస మాత్రం వసతులను కూడా ఫ్యాక్టరీ యాజమాన్యం కల్పించకపోవడంతో పలువురు నానా అవస్థలు పడుతున్నారు.

సంతకం పెట్టి వచ్చేశాం



ప్రభుత్వం రూ.8 లకు కిలో మామిడి కొనుగోలు చేయాలని మార్గదర్శకాలు ఇచ్చినప్పటికీ ఫ్యాక్టరీ యాజమాన్యాలు మాత్రం రూ.6కే అమ్ముతున్నట్లు సంతకాలు పెట్టించుకుంటున్నాయి. ఇదేంటని అని ప్రశ్నిస్తే ఇష్టముంటే ఉండండి లేదంటే వెళ్లిపోండి అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నాయి. ఫ్యాక్టరీ గేటులోకి రావడానికి నాలుగు రోజుల సమయం పట్టింది. ఇంత దూరం వచ్చి తిరిగి వెళ్లాలి అంటే మనసు ఒప్పుకోక సంతకం పెట్టి వచ్చేశాం. –రాజేంద్రరెడ్డి, బుక్కాపట్నం

వర్షం పడితే పూర్తి నష్టం

రుతుపవనాల రాకతో మామిడి పూర్తిస్థాయి కోతలు కాక ముందే వర్షాలు పడుతున్నాయి. పక్వానికి వచ్చిన మామిడికాయలను కోసి ఫ్యాక్టరీలకు తరలిస్తున్నా.. మూడు నాలుగు రోజులపాటు రోడ్డు మీదే గడపాల్సి వస్తుంది. వర్షంలో మామిడికాయ తడిస్తే పురుగు పట్టే అవకాశం ఎక్కువ. వీలైనంత త్వరగా మామిడిని కొనుగోలు చేసి రైతులకు మేలు కలిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. –సుగుణమ్మ, శెట్టిపారం

గతంలో ఇలా లేదు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపు మామిడిని గరిష్టంగా కిలో రూ.60, కనిష్టంగా కిలో రూ.13లకు విక్రయించాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మాత్రం రూ.8 అని చెప్పింది. తీరా ఫ్యాక్టరీల వారు రూ.6కే కొంటున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మామిడి రైతులకు న్యాయం చేయాలి. –గుణశేఖర్‌రెడ్డి, మామిడి రైతుల సంఘం జిల్లా నేత


గుణ శేఖర్ రెడ్డి మామిడి రైతు నాయకులు